నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | MAHABUBABAD

ఆ శాఖలో అందరూ ఇన్‌చార్జీలే..

- రెగ్యులర్ సిబ్బంది లేని లీగల్ మెట్రాలజీ కార్యాలయాలు
- ఐదేళ్లుగా భర్తీ కాని డిప్యూటీ కంట్రోలర్ ఆఫీసర్ పోస్టు
- నిరుపయోగంగా ఉంటున్న సర్కారు వాహనాలు
- అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన డీఎల్ఎంవో
- పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారస్తులు
- తూనికలు, కొలతల్లో మోసపోతున్న వినియోగదారులు

వరంగల్‌లోని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్, అసిస్టెంట్ కంట్రోలర్, డిస్ట్రిక్ట్ కంట్రోలర్ కార్యాలయం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 26 : వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతలు) కార్యాలయాలు ఇన్‌చార్జీలమయమయ్యాయి. పాత వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు ప్రధాన కార్యాలయంగా వరంగల్‌లో ఉన్న రీజినల్ డిప్యూటీ కంట్రోలర్ పోస్టు సైతం ఐదేళ్లుగా ఇన్‌చార్జీలతోనే కొనసాగుతున్నది. అలాగే కొత్త జిల్లాల్లో కూడా చాలా వరకు రెగ్యులర్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. దీంతో పర్యవేక్షణ కరువై వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జిలుగా ఉన్న డిస్ట్రిక్ట్ లీగల్ మెట్రాలజీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం, వ్యాపారుల నుంచి మామూళ్లు స్వీకరిస్తూ దాడులు చేయకపోవడంతో వినియోగదారులు మోసపోతున్నారని వినియోగదారుల మండలి సభ్యులు ఆరోపిస్తున్నారు. మరోపక్క కార్యాలయంలో ఉన్న మూడు వాహనాలను అధికారులు వాడకపోవడం వల్ల అవి నిరూపయోగంగా మారుతున్నాయి.

వరంగల్‌లో లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి మూడు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇందులో పాత జిల్లాలైన వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్‌కు సంబంధించి రీజినల్ డిప్యూటీ కంట్రోలర్ కార్యాలయం వరంగల్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్ సిద్ధార్థకుమార్ ఇన్‌చార్జి డిప్యూటీ కంట్రోల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. అయితే సదరు అధికారి మూడు రోజులు నల్లగొండ, మహబూబ్‌నగర్, మరో మూడు రోజులు వరంగల్‌లో ఉంటూ పాత మూడు ఉమ్మడి జిల్లాల బాధ్యతలు చూసుకుంటున్నారు. ఇక వరంగల్‌లోని అసిస్టెంట్ కంట్రోలర్‌గా ఉన్న రాజేశ్వర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కంట్రోలర్ అడ్మిన్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన ఎక్కువ శాతం హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీసులోనే ఉంటూ ఇక్కడికి అప్పుడప్పుడు వస్తుంటారు. అత్యవసరమున్న ఫైళ్లను హైదరాబాద్‌కే తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. అలాగే జిల్లా లీగల్ మెట్రాలజీ ఆఫీసర్‌గా ఉన్న ప్రవీణ్ గత నెలలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో ఇక్కడ జగిత్యాలకు చెందిన డీఎల్ఎంవో అజీజ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లోనూ ఇన్‌చార్జీలే..

వరంగల్‌లోని ప్రధాన కార్యాలయంతో పాటు మిగిలిన జిల్లాల్లో సైతం ఇన్‌చార్జీలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండకు జయశంకర్ భూపాలపల్లికి చెందిన డీఎల్ఎంవో శ్రీలక్ష్మి ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. ములుగుకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. జనగామ జిల్లాకు నల్లగొండకు చెందిన శ్రీనివాస రావు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మహబూబాబాద్ జిల్లాకు రెగ్యులర్ డీఎల్ఎంవోగా వినయ్‌కుమార్ ఉన్నప్పటికీ అతను ఖమ్మం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. మధిర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కొత్తగూడెం డీఎల్ఎంవో మనోహర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఇదే క్రమంలో కరీనంగర్, సిరిసిల్ల, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల కూడా విధుల్లో ఇన్‌చార్జీలే ఉంటున్నారు. మూడు నెలలుగా వీరి పర్యవేక్షణ లేక పలు వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మున్సిపాలిటీ దిశగా నెక్కొండ

ప్రతిపాదనలపై జడ్పీ సీఈవో కసరత్తు

నెక్కొండ ,సెప్టెంబర్ 26 : వరంగల్ జిల్లా నెక్కొండను మున్సిపాలిటీగా మార్చాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందిన క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు జడ్పీ సీఈవో, డీపీవో జీ రామ్‌రెడ్డి పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం సమావేశం నిర్వహించారు. నెక్కొండ పట్టణంతో పాటు మండలంలోని నెక్కొండ తండా, గుండ్రపల్లి, పత్తిపాక, టేకులకుంట తండా, అమీనేపేట గ్రామ పంచాయతీలను కలిపి నెక్కొండను మున్సిపాలిటీగా మార్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎంపీడీవో దయాకర్, వ్యవసాయాధికారి నాగరాజు, పంచాయతీరాజ్ ఏఈ, ఏపీవో జాకబ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి సదానందంతో సమావేశాన్ని నిర్వహించి ఆయా శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాల్సిందిగా ఆదేశించారు. నెక్కొండతో పాటు విలీన గ్రామాల సమగ్ర, భౌగోళిక సమాచారాన్ని అధికార యంత్రాంగం సేకరిస్తున్నది.

నెక్కొండ మున్సిపాల్టీ ప్రతిపాదిత సమావేశంలో జడ్పీ సీఈవో, డీపీవో జి.రాంరెడ్డి

• రౌడీషీటర్లపై నిఘా పెట్టాలి : సీపీ

మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

సుబేదారి, సెప్టెంబర్ 26 : రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలని, పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు వేగంగా చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదైన వారం రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, ప్రతి రోజు గంటసేపు పెండింగ్ కేసులపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో తప్పించుకొని తిరుగుతున్న నిందితులను పట్టుకోడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరం కార్డన్ సెర్చ్ చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు నివారణకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రవర్మ నాయక్, రవీందర్ పాల్గొన్నారు.

పోర సేవల్లో ప్రజల మెప్పు పొందుతూ కొందరు 'బెస్ట్ పోలీస్' అవార్డులు అందుకుంటుంటే.. మరికొందరేమో తమ వ్యవహార శైలితో పోలీస్ శాఖకే తలవంపులు తెస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తర్వాత అధికార పార్టీ నేతల మెప్పు కోసం కొందరు ఖాకీలు, మంత్రి అనుచరుడితో అంటకాగుతూ సామాన్యులపై జులుం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో మంత్రి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని అబాసుపాలైనా.. మేమింతే.. మారమంతే అన్నట్టు ఇటీవలి బల్దియా కౌన్సిల్ మీటింగ్ వద్ద అనుచరుడికి ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సలాం కొట్టిన తీరు విమర్శలకు తావిస్తున్నది. అంతటితో ఆగకుండా భూదందాలు, సెటిల్‌మెంట్లు, చివరకు చిన్న చిన్న గొడవల్లోనూ తలదూర్చి అతడి ఆజ్ఞానుసారం అమాయక ప్రజలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రతాపం చూపించడమే గాక బాధితులపైనే తప్పులు కేసులు పెడుతున్నారు. ఇలా అధికార పార్టీ అండతో అధికారులకు, పోలీసులకు హుకుం జారీ చేస్తూ నిత్యం అతడు చేస్తున్న ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది.
- సుబేదారి, సెప్టెంబర్ 26

- బాధ్యత మరచి విధులు.. శాఖకే తలవంపులు
- అబాసుపాలవుతున్నా మారని తీరు
- ఇప్పటికే బర్త్‌డే వేడుకలో పాల్గొని వివాదాల్లోకి..
- అడ్డూఅదుపు లేని మంత్రి అనుచరుడి ఆగడాలు

రౌడీకి పోలీస్ సలాం!

సామాన్యులపై జులుం.. మాజీ రౌడీషీటర్‌కు గులాం

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పోలీసు అధికారుల తీరు విస్తుగొల్పుతోంది. సామాన్యులపై జులుం ప్రదర్శిస్తూ.. రౌడీషీటర్లకు సలాం కొడుతుండడం, మంత్రికి సంబంధించిన అన్ని వ్యవహారాల్లో కీలకంగా ఉంటున్న సదరు వ్యక్తికి రాచమర్యాదలు చేయడం చర్చనీయాంశమవుతున్నది. మంత్రి అనుచరుడు చెప్పినట్లుగానే అన్ని స్టేషన్లలోని పోలీసు అధికారులు పనులు చేసిపెడుతుండగా సొంత పనులకు, సామాన్యులను బెదిరించేందుకు ఈ అనుచరుడు పోలీసులను రోజూ పురమాయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భూ దందాలు, కుటుంబ పంచాయితీల సెటిల్‌మెంట్లు, చివరికి కోర్టు పరిధిలోని లిటిగేషన్లలోనూ అతడు చెప్పినట్లే చేస్తున్నారనే చర్చ జరుగుతున్నది. మంత్రి కంటే ఎక్కువగా అనుచరుడి ఇంటి దగ్గర రోజంతా దర్బార్ నడుస్తున్నది. ఇటీవల మంత్రి పుట్టిన రోజు సందర్భంగా మంత్రి అనుచరుడు వరంగల్ ఏసీపీ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నడిరోడ్డుపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పటాకులు పేలి ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన ప్రజల్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. అనంతరం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యపై పోలీస్ కమిషనర్ బదిలీ వేటు వేశారు. ఈ పరిణామాల తర్వాత సైతం పోలీసు అధికారులలో ఎలాంటి మార్పు రావడం లేదు. ఇటీవల జరిగిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్ వద్ద మంత్రి అనుచరుడి హడావుడి, ఆయనకు పోలీసుల అతి మర్యాదలు పోలీస్ శాఖను అప్రతిష్టపాలు చేసే పరిస్థితి వచ్చింది. ఎలాంటి పదవి లేని ఓ మాజీ రౌడీషీటర్ గ్రేటర్ కౌన్సిల్ మీటింగ్‌కు రాగానే ఓ ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎదురు వెళ్లి సెల్యూట్‌తో స్వాగతం పలికిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. మంత్రి అనుచరుడు వరంగల్ నగరంలోని అతని నివాసం వద్ద సెటిల్‌మెంట్ల కోసం కోటరీతో దర్బార్ నిర్వహిస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో తానే అంతా అని అధికార పార్టీ క్యాడర్‌కు, అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు.

అక్కడ పనిచేస్తున్న పోలీసు అధికారులు పొద్దునే మంత్రి అనుచరుడిని కలిసి సెల్యూట్ చేసిన తర్వాతే డ్యూటీకి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మంత్రి అనుచరుడి సెటిల్‌మెంట్స్ దందాలతో సామాన్యులు భయాందోళకు గురవుతున్నారు. అధికార పార్టీ, పోలీసుల అండతో మంత్రి అనుచరుడు చేసే అరాచకాలకు అడ్డు లేకుండా పోతున్నదనే చర్చ జరుగుతున్నది.

అన్నింట్లో ఆయనే..

- వరంగల్‌లోని ఎల్బీనగర్‌లో నాలుగు రోటజుల క్రితం జరిగిన ఓ ఫంక్షన్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొన్ని చెక్కులను ప్రజాప్రతినిధి అందజేసి మిగతా వాటిని పంపిణీ చేయాలని స్థానిక నాయకులను ఆదేశించారు. అయితే ఈ విషయంలో స్థానిక కార్పొరేటర్, అధికార పార్టీ డివిజన్ అధ్యక్షుడి మధ్య గొడవ జరిగింది. కార్పొరేటర్ ఈ విషయాన్ని మంత్రి ప్రధాన అనుచరుడికి చేరవేశారు. అతడి ఆజ్ఞానుసారం స్థానిక ఇన్‌స్పెక్టర్ వెంటనే డివిజన్ అధ్యక్షుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి వీడియో కాల్ ద్వారా మంత్రి అనుచరుడికి చూపిస్తూ కొట్టినట్లు తెలిసింది.
- మంత్రి అనుచరుడి కుమారుడు పది రోజుల క్రితం బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఓ యువకుడు అడ్డుగా రావడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి అనుచరుడు ఈ విషయాన్ని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పడంతో సదరు యువకుడిని స్టేషన్‌కు తీసుకొచ్చాడు. ఇన్‌స్పెక్టర్ దగ్గరుండి మరీ మంత్రి అనుచరుడి కుమారుడితో, ఆయన స్నేహితులతో సదరు యువకుడిని పోలీసు లాఠీలతో కొట్టించినట్లు తెలిసింది. ఈ ఘటనను కూడా ఇన్‌స్పెక్టర్ వీడియోకాల్‌లో మంత్రి అనుచరుడికి చూపించినట్లు తెలిసింది.
- వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఓ కార్పొరేటర్‌కు, ఆయన సోదరులకు మధ్య 15 ఏళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని అధికార పార్టీలో చేరాలని ఆ కార్పొరేటర్‌పై మంత్రి అనుచరుడు ఒత్తిడి తెచ్చాడు. అయినా అతడు పార్టీలో చేరకపోవడంతో అనుచరుడు జోక్యం చేసుకుని కార్పొరేటర్ సోదరుడితో మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించాడు. పోలీసులు కార్పొరేటర్‌ను వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలున్నాయి.
- పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని ఓ వ్యక్తి వేధించాడు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా ఆ కేసును వెనక్కి తీసుకోవాలని మంత్రి అనుచరుడు బాధితురాలిని బెదిరించినట్లు తెలిసింది. మంత్రి అనుచరుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ బాధితురాలు మీడియా ద్వారా అతడి చేష్టలను బహిరంగ పరిచింది. ఆ తర్వాత పోలీసులు ఆమెపైనే తప్పుడు కేసులు పెట్టినట్లు సమాచారం.

కూలిన ఇండ్ల పైసలు కొందరికేనా?

నర్సింహులపేట, సెప్టెంబర్ 26 : ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు కూలిపోతే కొందరికే పైసలిస్తరా? అంటూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలోని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసిన అనంతరం ఈ నెల 4న తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ అఖిల్ గ్రామంలోని జెట్టి యాకయ్య, మందుల యాకన్న ఇండ్లను పరిశీలించారు. తీరా నష్టపరిహారం జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా తమ దృష్టికి వచ్చిన ఇండ్లను పరిశీలించామని, గతంలో కూలిన వాటిని వారు చూపించారని, అందుకే అర్హత కలిగిన 17 ఇండ్లకు రూ. 16,500 చొప్పున రూ. 2,80,500 పరిహారం వచ్చిందన్నారు. పడమటిగూడెంలో 2, రామన్నగూడెంలో 2, జయపురంలో 4, బాసుతండాలో 4, వప్రంతండాలో 2, వంతడపల, జగ్గుతండా, బొజ్జన్నపేటల్లోఒక్కొక్కటి చొప్పునడబ్బులువచ్చినట్లు తెలిపారు.

నా ఇల్లు కూలినా పేరు రాలేదు

వర్షాలతో నా ఇల్లు కూలిపోయింది. నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న. అధికారులు వచ్చి నా ఇల్లు చూసి వెళ్లారు. ఆ సమయంలో నాకు భరోసా ఇచ్చి పరిహారం వచ్చేలా చూస్తామని చెప్పారు. కానీ, పరిహారం లిస్టులో నా పేరు రాలేదు.
- మందుల యాకన్న, జయపురం, నర్సింహులపేట

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం అలేరు చెరువు కింద పొలాల్లో వేసిన రాళ్లు, ఇసుక మేటలు (ఫైల్)

నష్టం పూడ్చేదెవరు?

- కొట్టుకొచ్చిన ఇసుక మేటలతో రైతుల పరేషాన్
- తొలగించాలంటే రూ. లక్షల్లో వ్యయం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు

మహబూబాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఇటీవల వచ్చిన వరదలకు కొట్టుకొచ్చి పంట పొలాల్లో వేసిన ఇసుకమేటలతో రైతులు పరేషాన్ అవుతున్నారు. మేటల తొలగింపు వ్యయంతో కూడుకున్నది కావడంతో ఆ నష్టాన్ని ఎవరు పూడ్చాలి? అంటూ ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో వరదలకు 16,547 మంది రైతులకు చెందిన 14,247 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. పంటల వారీగా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇదిలా ఉంటే వరదల వల్ల జిల్లాలో 15 వేల నుంచి 20 వేల ఎకరాల్లో వేసిన ఇసుక మేటలు, రాళ్లు తొలగించలేని పరిస్థితి నెలకొంది. ఒకవైపు వరదలకు పంటలు కొట్టుకుపోయి పెట్టిన పెట్టుబడి, కూలీల ఖర్చులన్నీ నేలపాలు కాగా, మేటలు తొలగించాలంటే మళ్లీ రూ. లక్షల్లో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవేళ మేటలు తొలగించినా నేల స్వభావం మారి పంటలు పండుతాయో లేదోననే ఆందోళన వారిలో నెలకొంది. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు అంచనా వేశారని, మరి ఇసుక మేటలు తొలగించేందుకయ్యే ఖర్చులు ఎవరిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిలాల కోమటికుంట చెరువు కింద పొలాల్లో వేసిన ఇసుక మేటలు (ఫైల్)

భూములు పనికి రాకుండా పోయాయి.

గత 25 రోజుల కింద ఆకేరు వాగు వరద వల్ల భూమిపై ఉన్న సారవంతమైన నేలతో పాటు నా రెండెకరాల మిర్చి తోట కొట్టుకుపోయి ఇసుక మేటలు వచ్చినయ్. రూ. లక్ష వరకు నష్టం వాటిల్లింది. నాలుగైదు ఏళ్లు వ్యవసాయానికి భూములు పనికిరావు. సారవంతమైన చెరువు మట్టి పోయడానికి సుమారు రూ. 4 లక్షల వరకు ఖర్చవుతుంది. వ్యవసాయ అధికారులు పదేపదే సర్వే నిర్వహిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం రాలేదు. ఇప్పటికైనా మాకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
-ధరావత్ కుమార్, రైతు, దుబ్బగడ్డ తండా

ఏడు నెలలుగా జీతాల్లేవ్..

- వేతనాలు రాక ధరణి ఆపరేటర్ల ఇబ్బందులు
- కుటుంబ పోషణ కష్టమవుతున్నదని ఆందోళన

నర్సింహులపేట, సెప్టెంబర్ 26 : రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ల పరిస్థితి దారుణంగా మారింది. అంతంత మాత్రమే ఉన్న జీతాలు ఏడు నెలలుగా రాకపోవడంతో కుటుంబ పోషణకూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేసేందుకు 671 మంది ధరణి ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తుండగా, ఇందులో మహబూబాబాద్ జిల్లాలో 18 తహశీల్దార్ కార్యాలయాల్లో వీరు పని చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలనెలా వేతనాలు వచ్చేవని, ప్రస్తుతం ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు వేతనాలు ఇవ్వకుండానే పనులు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోజువారీ ప్రయాణ ఖర్చులకు కూడా ఇబ్బందవుతున్నదని, జీత భత్యాలు, ఉద్యోగ భద్రత విషయంలో థర్డ్ పార్టీ ఏజెన్సీని రద్దు చేసి, వేతనాలను ప్రభుత్వ ఖజానా ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లు కోరుతున్నారు. తాము వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, భూ సంబంధిత ఫిర్యాదుల టెక్నికల్ పరిష్కారాలు, ఎన్నికలు విధులు, ప్రజాపాలన ధరఖాస్తులతో పాటు తహశీల్దార్ కేటాయించే ఇతర విధులను నిర్వర్తిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్కో ఉద్యోగికి నెలవారీగా రూ. 29,500 వేతనంగా ఇస్తున్నప్పటికీ ఏజెన్సీద్వారా కేవలం రూ.12,031 మాత్రమే తమకు జమవుతున్నాయన్నారు. అవి కూడా ఏడు నెలలుగా అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. అయితే ఏజెన్సీతో ప్రభుత్వం గత మే 14 వరకు ముగియగా, ఇప్పటి వరకు ఇతరులకు అప్పజెప్పకపోవడంతోనే జీతాల చెల్లింపుల్లో ఆలస్యమవుతున్నట్లు తెలిసింది.

కుటుంబ పోషణ భారంగా మారింది

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆగస్టు నెల వరకు ఆపరేటర్ల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మాకు కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం వెంటనే ఏడు నెలల జీతాలు మంజూరు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. నూతనంగా ప్రవేశపెట్టే ఆర్‌వోఆర్ చట్టంలో ఆపరేటర్లను భాగస్వాములను చేయాలి. నెలనెలా జీతాలు ఇవ్వడంతో పాటు మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నాం.
- పీ యాదగిరి, ధరణి ఉద్యోగుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు

బిల్లులు చెల్లించాలని బడికి తాళం

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

నెల్లికుదురు, సెప్టెంబర్ 26 : చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని బడికి తాళంవేసి నిరసన వ్యక్తం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని మేచరాజుపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు బాదావత్ దినేశ్, కోటగిరి కిరణ్ కుమార్ 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 17.50 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించడంలేదు. దీంతో గురువారం ఉదయం పాఠశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లలేక పోయారు. కొద్దిసేపయ్యాక గేటు చిన్న డోర్‌ను ఓపెన్ చేసుకుని విద్యార్థులు ఉపాధ్యాయులు లోపలికెళ్లారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మేచరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటుకు తాళం వేయడంతో బయటే నిలబడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాష్ట్రంలో వైద్య వ్యవస్థ అస్తవ్యస్తం

మల్కాపూర్ పీహెచ్‌సీలో సేవలపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య అసంతృప్తి

చిల్పూరు, సెప్టెంబర్ 26 : ఊరూరా ప్రజలు డెంగ్యూ, విష జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ముఖ్యమంత్రికి, నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి చీమకుట్టినట్టు కూడా లేదని.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మండిపడ్డారు. ఇటీవల బీఆర్ఎస్ నియమించిన త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల సందర్శనలో భాగంగా గురువారం ఆయన చిల్పూరు మండలం మల్కాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో పరిస్థితులను చూసి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ దవాఖానలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడం, పీహెచ్‌సీ శుభ్రంగా లేకపోవడం చూస్తుంటే సర్కారు దవాఖానల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ఇటీవల గాంధీ ఆసుపత్రి సందర్శనకు వెళ్తుంటే అక్రమ అరెస్టులు చేశారని, కనీసం సందర్శనకు కూడా అనుమతించలేదని ధ్వజమెత్తారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలందేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మారపాక రవి, మాజీ మార్కెట్ డైరెక్టర్ రంగు హరీశ్, చిల్పూరు మండల యూత్ నాయకుడు అలుగు అశోక్, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్కాపూర్ పీహెచ్‌సీని సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఫ్యాషన్ షో అదుర్స్..

కేఎంసీలో నేటితో ముగియనున్న ఉత్కర్ష

కాకతీయ మెడికల్ కళాశాలలో ఉత్కర్ష-24 వేడుకలు ఆరో రోజు ఉల్లాసంగా కొనసాగాయి. వేడుకల్లో భాగంగ